
# ధరణి తీసేస్తే.. సాగు భూములు

# బీడు భూములే..

## ధరణి రద్దు, 3 గంటల కరెంట్‌పై రైతన్నల ఆగ్రహం



రైతుల భూములకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో భూములపై రైతులకు సర్వహక్కులు సమకూరాయి. అలాంటిది రైతు వ్యతిరేక పార్టీ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని ఆ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పాలనలో పటేల్, పట్వారీ వ్యవస్థతో పడిన కష్టాలు చాలని, మళ్లీ అలాంటి ఇబ్బందులు పడలేమని పేర్కొంటున్నారు. భూ రికార్డుల తప్పిదాలతో నిత్యం కొట్లాటలు, కేసులతో పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి అలిసిపోయామని, మళ్లీ ఆ పార్టీ వస్తే ఎనుకటి రోజుల మాదిరి ఆ బాధలు పడలేమని చెప్తున్నారు. వ్యవసాయం దండుగ అన్నచోట పండుగలా మార్చిన ప్రస్తుత ప్రభుత్వంతో రైతుల బతుకులు మారుతున్నాయి. ఇప్పడు ఆ పార్టీవారి కల్లబొల్లి మాటలు, ఆచరణ సాధ్యం కాని హామీలను నమ్మి వారికి ఓటేస్తే మళ్లీ మోసపోతే గోస పడ్తమని రైతులు ఆలోచిస్తున్నారు. ధరణి పోర్టల్‌తో భద్రంగా ఉన్న భూములను మాయం చేయాలని చూసే వాళ్లకు ఓటుతోనే బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నారు.

ధరణితో ఒక్కొక్కటిగా సమస్యలన్నీ పరిష్కారమవుతున్నాయి. ఇప్పడు ధరణి పోర్టల్ స్థానంలో భూ మాత తీసుకొచ్చి రైతులకు పంచాయతీ పెట్టవద్దని రైతులు సూచిస్తున్నారు. గతంలో భూ రిజిస్ట్రేషన్లు కావడానికి ఏండ్ల తరబడి తహసీల్, రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పని అయ్యేది కాదు. లంచాలు ఇవ్వనిదే ఫైలు ముందుకు కదిలేది కాదు. ఒకరి పేరిట ఉన్న భూములను పట్టాదారుకు తెలియకుండా పలుకుబడి ఉన్న వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేసేవారు. గతంలో భూముల వివరాలు సక్రమంగా లేకపోవడంతో గ్రామాల్లో భూ తగాదాలు జరుగుతుండేవి. ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతో కేసీఆర్ భూ రికార్డుల క్రమబద్ధీకరణకు శ్రీకారం చుట్టారు. రికార్డులను ఆన్‌లైన్ చేసి ధరణి పోర్టల్‌లో నిక్షిప్తం చేయడంతోపాటు కొత్త పాస్ బుక్కులు అందించారు. ధరణికి ముందు మాన్యువల్ రికార్డులు ఉండేవి. ఎవరి భూమి ఎవరికి సొంతమో తెలియని అయోమయ పరిస్థితి ఉండేది.

స్వరాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ అందుతున్నది. దాంతో రైతులు ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగు చేసుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా నాలుగైదు గంటల కరెంట్, రాత్రి పూట పొలాల్లో పడిగాపులు, ఎరువులు, విత్తనాల బాధలు, ధాన్యం కొనుగోళ్ల కష్టాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల జీవితాల్లో నిప్పులు పోసేందుకు కంకణం కట్టుకున్నది. 24 గంటల కరెంట్ అవసరం లేదని, 10 హెచ్‌పీ మోటర్లు కొనుక్కుంటే 3 గంటలు చాలని అంటున్నది. దీనిపై రైతులు భగ్గుమంటున్నారు. 10 హెచ్‌పీ మోటర్లకు అయ్యే ఖర్చు ఎవడిస్తడని నిలదీస్తున్నారు. నాటి పాలనలో రాత్రిపూట కరెంటు కోసం పడిగాపులు కాసి కరెంట్ షాక్, పాము, తేలు కాట్లతో ఎంతో మంది రైతులు చనిపోయిన ఘటనలు ఇంకా మర్చిపోలేదని దుమ్మెత్తిపోస్తున్నారు. రైతు వ్యతిరేక పార్టీని కచ్చితంగా ఓడిస్తామని స్పష్టం చేస్తున్నారు.

- ◆ ప్రస్తుత ప్రభుత్వంలో విద్యుత్‌రంగం బలోపేతం
- ◆ 24/7 నిరంతర కరెంట్‌తో హ్యాపీగా పల్లెలు, పట్టణాలు
- ◆ ధరణితో దందాలకు చెక్
- ◆ తహసీల్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్
- ◆ భూమాత వస్తే మళ్లీ పైరవీలు, ముడుపులే..
- ◆ పట్వారీ, దళారీ వ్యవస్థతో రైతులు ఆగమే ..
- ◆ వ్యవసాయంపై కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్న రైతు వ్యతిరేక పార్టీపై అన్నదాతల ఆగ్రహం
- ◆ అహంకార పూరిత వ్యాఖ్యలు మానుకోవాలని హితవు
- ◆ చిన్న, సన్నకారు రైతులపై భారం మోపే కుట్రలని ఆవేదన

### కౌలుకిస్తే పట్టా మార్పిడి



ముఖ్యమంత్రి కేసీఆర్ ధరణి పోర్టల్ పెట్టడంతో భూములను ఎన్నేండ్లు కౌలుకిచ్చినా పట్టేదారుకు ఎలాంటి ఢోకా లేదు. గతంలో భూములు సాగు చేయలేని పరిస్థితుల్లో కౌలుకిస్తే ఎక్కువ కాలం కౌలు చేసుకున్న రైతులే పట్టా మార్పిడి చేసుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. రేవంత్‌రెడ్డి ధరణిని తొలగించి కౌలు రైతులకు రైతు బంధు ఇస్తాననడంతో కౌలు రైతులు, పట్టాదారుల మధ్య చిచ్చు రేపడమే అవుతుంది. కౌలుకిచ్చిన రైతులందరూ సామాన్యులే.. ఎకరం, రెండు ఎకరాలు కలవారే ఉంటారు. ప్రశాంతంగా పంటలు పండించుకుంటున్న రైతులను ఆగమాగం చేయడానికే కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నది. రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఇప్పుడిప్పుడే అభివృద్ధి దశలోకి వెళ్తూ దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణ రాష్ట్రంగా పేరొందుతున్నది. వ్యవసాయ రంగంపై ఏమాత్రం అవగాహన లేకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు.

**- జి.లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్, ఉమ్మడి గండీడ్ మండలం**

### పట్టపగలే కరెంటు ఉండేది కాదు



పదేండ్ల క్రితం పట్టపగలు కూడా కరెంటు ఉండేది కాదు. ఇంట్లో చిన్న పిల్లలు వృద్ధులు ఉడకపోతతో అల్లాడిపోయేవాళ్లు. మా గ్రామంలో ఉదయం 6 గంటలకు కరెంటు పోతే రాత్రి 7 గంటలకు వచ్చేది. గృహిణులు, వృద్ధులు, చిన్నారులతో కలిసి బయటికి వెళ్లి గాలి విసురుకుంటూ కాలక్షేపం చేసేవాళ్లం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన విద్యుత్ సంస్కరణలతో 24 గంటల పాటు గృహాలకు, వ్యవసాయానికి కరెంటు నిరంతరాయంగా వస్తున్నది. సీఎం కేసీఆర్‌కు పల్లె ప్రజలంతా రుణపడి ఉంటారు. కేసీఆర్ సారథ్యంలోని రాష్ట్రంలో కరెంటు కష్టాలు మాయమయ్యాయి.

**- బోడ నందు, ధర్మాపూర్, ధారూరు**

### ధరణి మాటెత్తే అర్హత కాంగ్రెస్‌కు లేదు



పటేల్, పట్వారీ వ్యవస్థకు చరమ గీతం పాడి దళారీ వ్యవస్థను సమూలంగా నాశనం చేసి రైతన్నలను రాజులను చేసే దిశగా ధరణిని సీఎం కేసీఆర్ మా కోసం తీసుకొచ్చారు. ధరణి పోతే మా భూములకు రక్షణ కరువైపోతుంది. మళ్లీ కష్టాల కడలిలోకి ప్రతి రైతు వెళ్తాడు. కాంగ్రెస్ వస్తే భూ సమస్యలు మొదటికి వస్తాయి. రైతుల మీద కాంగ్రెస్ కక్ష కట్టింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ జిమ్మిక్కులను తిప్పికొడతాం. ఓటు ద్వారా బుద్ధి చెబుతాం. రైతుల సమస్యలను తీర్చిన ముఖ్యమంత్రి కేసీఆర్. ఆయన వెంటే మా రైతాంగం మొత్తం ఉంటాం. ధరణి ఎత్తేస్తే కౌలుదారు వ్యవస్థ రావడమే కాకుండా మామూళ్ల పర్వం మొదలవుతుంది. ధరణి రాకముందు భూమి అమ్ముదామన్నా, కొందామన్నా చాలా ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు ధరణి వచ్చాక ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిచేది లేదు. సచ్చేది లేదు.

**- భూపాల్‌రెడ్డి, అగ్గనూరు, యాలాల**

### ధరణి తీసేస్తే మళ్లీ దోపిడీ షురూ..



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ముందు ధరణిని తీసేస్తమని అంటున్నారు. అదిగాని జరిగితే మళ్లీ దళారుల రాజ్యం రాక తప్పదు. రికార్డుల్లో భూముల వివరాలను ఇష్టమొచ్చినట్లు నమోదు చేయడంతో, రికార్డుల తారుమారుతో భూ తగాదాలు పెరిగిపోతాయి. ధరణి వచ్చిన నాటి నుంచి రైతులు భూముల పట్ల ఎంతో భరోసాగా ఉన్నారు. కావాల్సిన సమయంలో భూముల వివరాలను చూసుకునే అవకాశం ఏర్పడింది. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే.. ఆగం కావడం ఖాయం.

**- రవీందర్‌నాయక్, అడ్వకేట్, కొడంగల్**

### ప్రదక్షిణలు తప్పవు



రైతన్నకు పైసా ఖర్చు లేకుండా పాస్‌బుక్ వచ్చిందంటే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణి ఘనతే. గతంలో పొలానికి పాసు బుక్‌లు చేయించుకోవాలంటే వీఆర్‌ఏ నుంచి తహసీల్దార్ వరకు వారి ఆఫీసుల చుట్టూ చెప్పులరిగేలా ప్రదక్షిణలు చేయడమే తప్ప పనయ్యేది కాదు. అటువంటి పరిస్థితులను చక్కదిద్దేందుకు ధరణి పోర్టల్ రావడంతో రైతన్న ఒక్కరోజులోనే పాస్‌బుక్‌లు చేయించుకొని ఆనందపడుతున్నాడు. కాంగ్రెస్ పార్టీ భూమాత ప్రవేశపెడితే రైతుల భూములు మాయమవుతాయి. కౌలుదారుల చట్టం తెస్తే ఊర్లల్లో మళ్లీ గొడవలు మొదలవుతాయి. కౌలు అనుభవదారుల కాలమ్ పెడితే భూమి నాదంటె.. నాదని కోర్టులకెక్కుతరు. వేరే పనుల మీద పట్నాల్లో ఉండే కొంత మంది తమ భూములు కౌలుకు ఇస్తున్నరు. ఈ చట్టం వస్తే ఆళ్లు గిట్ల కౌలుకు ఇయ్యరు. దాంతో చిన్న రైతులు ఇబ్బందులు పడ్తరు. కాంగ్రెసోళ్ల పనే గిది. ఇప్పుడున్న ధరణితో అంతా ప్రశాంతంగా ఉంది. భూమి ఎవరితో ఆన్‌లైన్‌లో నమోదై ఉంటుండడంతో ఏ గొడవలు లేవు. ధరణి పోర్టలే మంచిగున్నది. పాత విధానం అంటే మళ్లా దళారులే వస్తరు. భూములన్నీ ఆగమాగమవుతై. దళారుల రాజ్యం మాకొద్దు. కరెంట్ కోసం మధ్య రేత్రి బావుల కాడికి వెళ్లి పడిగాపులు కాసేది. మా కోసం పని చేసే ప్రభుత్వానికే మద్దతిస్తాం. సీఎం కేసీఆర్‌కు పల్లె ప్రజలంతా రుణపడి ఉంటారు. రాష్ట్రంలో కరెంటు కష్టాలు మాయమయ్యాయి. అందుకే మళ్లీ సీఎంగా కేసీఆర్ సారే రావాలి.

**- కుర్వ నందు, నర్సాపూర్, ధారూరు**


### అర్హత లేని పార్టీవి మోసపూరిత మాటలు



మూడు గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటర్లు అంటూ కాంగ్రెసోళ్లు మోసపూరిత మాటలు మాట్లాడుతున్నారు. అసలు 24 గంటల కరెంటు ఇస్తే కాంగ్రెస్ వాళ్లకు ఏం బాధ. మూడు గంటల కరెంటు ఇచ్చి రైతులను కారు చీకట్లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కేసీఆర్ సారు వచ్చినాక రాత్రిళ్లు పొలాలకు పోయే కష్టం తప్పింది. మాకు అవసరం వచ్చినప్పుడు పంటలకు నీళ్లు పెట్టుకుంటున్నాం. అవసరం లేనప్పుడు మోటర్లు బంద్ చేసుకుంటున్నాం. మీరిచ్చే మూడు గంటల కోసం ఎదురుచూపులెందుకు. ఇప్పుడున్న 24 గంటలతో రైతులు పుష్కలంగా పంటలు పండించుకుంటున్నారు. 10 హెచ్‌పీ మోటరును ఒక చిన్న రైతు కొనగలడా.. దానికి పైపులు, కేబుల్ అన్నీ కలిపి దాదాపు లక్ష వరకు ఖర్చు వస్తుంది. ఖర్చును చిన్న రైతులు భరించలేరు. ఇప్పుడు ఒక ట్రాన్స్‌ఫార్మర్ కింద మూడు నాలుగు మోటర్లు నడుస్తున్నాయి. 10 హెచ్‌పీ మోటర్లు బిగిస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. మోటర్లను తిరిగి రిపేరు చేయించుకోవాలంటే రైతులకు అదనపు భారం పడుతుంది. ఎద్దు, ఎవుసం తెలియనోళ్లు రైతుల గురించి వ్యవసాయం గురించి మాట్లాడుతున్నారు. రైతుల కష్టాలు ఎరిగిన ఏకైక మనిషి సీఎం కేసీఆర్ సారే.

**- సందోళ్ల చిన్న హన్మయ్య, రైతు, గాధిర్యాల్**

### రైతులను ముంచడానికే..



కాంగ్రెస్ నాయకులు రైతులను ముంచడానికే మూడు గంటల కరెంట్ సరిపోతుందంటున్నారు. సీఎం కేసీఆర్ 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇస్తుండు. దీంతో రాత్రిపూట పొలాలకు వెళ్లకుండా పగటి పూట పొలాల్లో పనులు చేసుకుంటున్నాం. మునుపటికంటే ఎక్కువగా పంటలు పండిస్తూ సంతోషంగా ఉంటున్నాం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల కోసం అన్ని విధాలుగా సదుపాయాలను కల్పిస్తున్నది.

**- మహేందర్‌రెడ్డి, కంసాన్‌పల్లి, బషీరాబాద్**


### ధరణి పోర్టల్ ఎత్తివేస్తే రైతు పరిస్థితి ఆగమ్యగోచరం



ధరణి పోర్టల్‌లో ఎత్తివేస్తే రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది. మరో 30 ఏండ్లు తెలంగాణ వెనక్కి పోతుంది. గతంలో ఎన్ని కష్టాలు పడ్డామో.. మరోసారి అన్నికష్టాలు పడాల్సి వస్తుంది. రైతు ప్రభుత్వం ఉంటేనే రైతు క్షేమంగా ఉంటాడు. 24 గంటల కరెంట్‌తో రైతు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాడు. బోర్లు, బావుల కింద నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. 10 హెచ్‌పీ మోటర్లు బిగిస్తే మోటర్లకు, పైపులకు అయ్యే ఖర్చుతో మాలాంటి రైతుల జేబుకు చిల్లు పడుతుంది. కాంగ్రెస్‌ను నమ్మొద్దు. రైతు కోసం కష్టపడే నాయకులను ఎన్నుకుందాం.

**-రాంచందర్, అంతారంతండా, తాండూరు**

### 3 గంటల కరెంట్‌తో ఆత్మహత్యల తెలంగాణ అవుతుంది



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతు ఆత్మహత్యల తెలంగాణగా మారుతుంది. గత ప్రభుత్వాల పాలనలో కరెంట్ కోతలతో పంటలు సరిగ్గా పండక అనేక ఇబ్బందులపాలయ్యారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పరిపాలన సాఫీగా సాగాలంటే మూడోసారి కేసీఆర్ సీఎం కావాల్సిందే. రైతులకు పెట్టుబడి సహాయం అందజేయడం వల్ల రైతు ఆత్మహత్యలు లేవు. కరెంట్ కష్టాలు లేవు. రైతుకు మేలు చేశారు. రైతు రాజ్యం తీసుకువచ్చారు. రైతును రాజు చేయాలనే సంకల్పం ఉన్న నాయకుడు కేసీఆర్. మరోసారి అధికారంలోకి వస్తారు.

**-పెంటయ్యగౌడ్, మిట్టబాసుపల్లి, తాండూరు**

### లంచాల బాధ తప్పదు



ధరణి రావడంతో దరిద్రం పోయింది. భూసమస్యలతో గతంలో చాలా ఇబ్బందులు పడ్డాం. ధరణితో భూసమస్యలు తొలగిపోయాయి. గతంలో భూమి పట్టాలను మార్పిడికి ఎన్నో ఇబ్బందులు పడ్డాం. మధ్యవర్తులు, దళారులను నమ్ముకొని లంచాలు ఇస్తూ మోసపోయాం. ధరణి పోర్టల్ వచ్చాక రైతులు, సామాన్య ప్రజలు భూపట్టాలు మార్చుకోవడానికి భూమి రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి చాలా సులభమైంది. రైతుల ఇబ్బందులు తొలగిపోయాయి. భూ పట్టాలకు లంచాలిచ్చే బాధ తప్పింది. ప్రస్తుతం 24 గంటల నాణ్యమైన విద్యుత్, ధరణిని తీసుకొచ్చిన కేసీఆర్‌కు ధన్యవాదాలు.

**- సోఫీ మియా, మర్పల్లి**

### కౌలుదారు చట్టంతో సాగు విస్తీర్ణం తగ్గిపోతుంది



కాంగ్రెస్ పార్టీ వస్తే కౌలుదారు చట్టం తీసుకువస్తే సాగు విస్తీర్ణం తగ్గిపోతుంది. పట్టాదారులు తమ భూములను కౌలుదారులకు ఇచ్చేందుకు ఇష్టపడరు. కౌలుదారులకు భూములివ్వకపోవడంతో సాగు పూర్తిగా తగ్గిపోతుంది. దీంతో కౌలుదారులకు కన్నీళ్లే మిగులుతాయి. ప్రతిపక్ష పార్టీల నాయకులు రైతులకు 3 గంటలు సరిపోతుంది అనడం సిగ్గుచేటు. తెలంగాణ సర్కార్ వ్యవసాయ సాగు కోసం 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నందుకు సీఎం కేసీఆర్‌కు ప్రతి రైతు జీవితాంతం రుణపడి ఉంటాడు.

**- నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్, కులకచర్ల**

### వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఎలా సరిపోతుంది



కాంగ్రెస్ నాయకుల మాటలు తలా తోక లేకుండా ఉన్నాయి. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఎలా సరిపోతుందో వారికే తెలియాలి. ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చాక వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇచ్చి, పంట పెట్టుబడికి ఎకరానికి రూ.10వేలు పండుగలా మార్చారు. రైతులు చాలా సంతోషంగా, అప్పులు లేకుండా వ్యవసాయం చేసుకుంటున్నారు. కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంటు ఇస్తే రైతులు ఆగం కావాల్సిందే. వ్యవసాయాన్ని ఇంత మంచిగా తీర్చిదిద్దిన కేసీఆర్‌కు ఓటు వేసి మూడోసారి సీఎంను చేస్తాం.

**- తిరుపతి, దామర్‌చేడ్, బషీరాబాద్**

### రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టి ఎవుసం చేయలేరు



నిరుపేద రైతులు 24 గంటల కరెంట్‌తో వ్యవసాయం చేస్తూ సంతోషంగా ఆనందంగా ఎవుసం చేసుకుంటున్నారు. అలాంటిది ఉన్నట్లుండి వ్యవసాయానికి ప్రతిపక్షపార్టీలు 24 గంటల కరెంట్‌ను తీసి, కౌలుదారు కాలం పెట్టి, రైతు బంధులో మార్పు తెచ్చి నానా ఇబ్బందులకు గురి చేస్తే రైతులు ఆగమైపోవడం ఖాయం. ఒకవేళ అదే జరిగితే రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోలేక, 3 గంటల కరెంట్‌తో వ్యవసాయం చేయలేక, కౌలుదారు కాలంతో రైతు బంధు కోసం భూయజమాని, కౌలుదారు పంచాయితీలు పెట్టుకొని నానా ఇబ్బందులు పడుతూ వ్యవసాయాన్ని గాలి కొదిలేసే ప్రమాదముంది. రైతులు ఉన్నట్లుండి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటే నిరుపేద రైతులు అన్ని వేల రూపాయలు ఎక్కడి నుంచి తీసుకొస్తారు. అవన్నీ చేయలేక వ్యవసాయం కుంటుపడుతుంది. అందుకే రైతులు అన్నీ గమనించాలి. సాయం చేసే వ్యక్తులకే మద్దతు ఇవ్వాలి.

**- బుల్ల రాములు, రైతు, జనగాం, పెద్దేముల్**

### వ్యవసాయ రంగానికి నిరంతరం కరెంట్ అవసరం



వ్యవసాయ రంగానికి నిరంతరం కరెంట్ అవసరం. వ్యవసాయానికి ఎంత కరెంట్ అవసరమనేది రైతుకు మాత్రమే తెలుసు. తెలంగాణ పీసీసీ రేవంత్‌రెడ్డికి వ్యవసాయంపై అవగాహనలేదు అందుకే ఎక్కడ పడితే అక్కడ రైతులకు వ్యవసాయానికి 3 గంటలే చాలని చెబుతున్నాడు. ఎప్పుడైనా వ్యవసాయం చేశాడా ? గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 5, 6 గంటలు మాత్రమే ఇచ్చేది. అది కూడా రాత్రి 3 గంటలు, పగలు 3 గంటలు ఇచ్చేది. కానీ వ్యవసాయానికి ఏమాత్రం సరిపోయేది కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రైతుల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం ఉచిత కరెంటును అందిస్తున్నారు. ప్రస్తుతం రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. రైతుల కోసం ఆలోచిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

**- వెంకటయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు, వికారాబాద్**

### 10 హెచ్‌పీ మోటర్లు వాడటం సాధ్యం కాదు



కాంగ్రెస్‌వారు అంటున్న 10 హెచ్‌పీ మోటర్లు కొనడం, పంటలు సాగు చేయడం సాధ్యమయ్యే పనికాదు. 3 గంటల కరెంట్‌తో మూడు, నాలుగు ఎకరాలకు నీరు ఎలా పారబెడతారు. 24 గంటల కరెంట్ ఇస్తేనే పంటలకు పుష్కలంగా నీరు అంది పంట దిగుబడి పెరుగుతుంది. లేకపోతే ఒక మూలకు తడిగా ఉండి, మరో మూలన ఎండుముఖం పడుతుంది. ఉన్న 3 హెచ్‌పీ మోటర్లతోనే వ్యవసాయ పనులు, కూరగాయల సాగు చేసుకుంటున్నాం. 24 గంటల కరెంట్‌తో ఎప్పుడు పడితే అప్పుడు నీరు పారబెట్టుకుంటున్నాం. 3 గంటలతో బోరు బావుల వద్దనే పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

**- శివకుమార్, రైతు బంధు అధ్యక్షుడు, దామస్తాపూర్, మర్పల్లి**


### మడి తడవాలంటే పడిగాపులే..



కాంగ్రెస్ పార్టీ వస్తే మూడు గంటల కరెంటు ఇస్తుంది. మూడు గంటల కరెంటు వస్తే పంటలు పండించుకోలేము. మడి తడవాలంటే పడిగాపులు కాయాల్సిందే. కాంగ్రెసోళ్లకు ఎవుసం తెలియదు కాబట్టే 3 గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలని ఇష్టం వచ్చినట్లుగా చెబుతున్నారు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటే కనీసంగా రూ.లక్ష కావాలి. సన్న, చిన్నకారు రైతులకు ఇది సాధ్యమా..? కాంగ్రెస్ రాకముందే ఈ విధంగా మాట్లాడితే.. కాంగ్రెస్ వస్తే కష్టాలు తప్పవని తెలుస్తున్నది. సీఎం కేసీఆర్ ఉంటేనే రైతుల కష్టాలు తీరుతాయి. అన్నింటా సౌకర్యాలతో పంటలను పండించుకోవచ్చు. ఇబ్బందులులేని అమ్మకాలు చేసుకోవచ్చు.

**- మధుసూదన్‌రెడ్డి, ధర్మాపూర్, అంగడిరైచూర్, కొడంగల్**

### ధరణి ఎత్తేస్తే భూమి రక్షణ పోతుంది



కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారంలోకి వస్తే ధరణి ఎత్తేస్తామని మాట్లాడుతున్నారు. ధరణి ఎత్తేయడం అంత సులువైన పని కాదు, దాని వెనకాల ఏదో పెద్ద కుట్ర ఉన్నది. అందుకే పదే పదే ధరణిని తొలగిస్తామని పేర్కొంటున్నారు. భూములకు రక్షణ లేకుండా పోతుంది, పట్వారీ వ్యవస్థ మళ్లీ వస్తుంది. ఏవైనా లోపాలుంటే సరిచేస్తామని చెప్పాలి కాని, పదే పదే ధరణిని తొలగిస్తామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉంది. కాంగ్రెస్ నాయకుల మాటలతో వ్యవస్థలపై నమ్మకం పోతుంది. ఇలాంటి వారికి అధికారం అప్పగిస్తే చాలా ప్రమాదం. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలి.

**- లక్ష్మీకాంత్‌రెడ్డి, కాశీంపూర్, బషీరాబాద్**

### రైతు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తుంది



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతు వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతుంది. కాంగ్రెస్ పార్టీ రైతులకు మూడు గంటలు విద్యుత్ ఇస్తే సరిపోతుందని చెప్పడం సరికాదు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది. అప్పట్లో రాత్రింబవళ్లు పంట పండించడానికి కష్టపడేవాళ్లం. రాత్రి సమయంలో త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయడం ద్వారా చాలా ఇబ్బందులు పడ్డాం. రైతులను పట్టించుకోక గతంలో వ్యవసాయం దండుగ అనే స్థితికి వచ్చింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయదారులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించి, రైతు సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టడంతో రైతులకు మంచి రోజులు వచ్చాయి. కాని మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు గడ్డుకాలం వస్తుంది. దీన్ని రైతులు గమనించాలి.

**- పీరంపల్లి రాజు, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు, కులకచర్ల**

### వ్యవసాయానికి 3 గంటల కరెంట్‌తో పెను ముప్పు



తెలంగాణ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల కరెంట్‌ను సరఫరా చేస్తూ రైతులను ఆదుకుంటున్నారు. 24 గంటల కరెంట్‌తో వ్యవసాయం ప్రస్తుతం సాఫీగా సాగుతున్నది. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వ్యవసాయానికి 24 గంటల కరెంట్ సరఫరాను నిలిపివేస్తే వ్యవసాయం మొత్తం ఆగమవుతుంది. అదే విధంగా పట్టా భూమి ఉన్న యజమానికిగానీ, కౌలుదారుకుగానీ ఎవరో ఒకరికే రైతు బంధు డబ్బులు వేస్తామని చెప్పి యజమానికి, కౌలుదారునికి పంచాయితీలు పెట్టాలని కాంగ్రెస్ చూస్తున్నది. ఒకవైపు సీఎం కేసీఆర్ రైతులకు రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చి ఆదుకుంటుంటే కాంగ్రెస్ మాత్రం అందుకు భిన్నంగా రైతులకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేయాలని చూస్తున్నది. అందుకే రైతులు ఆగం కావద్దు.. ఆలోచించి అడుగు వేయాలి.

**- బసిరెడ్డి, రైతు, జనగాం, పెద్దేముల్**

### కరెంటు కోతలు.. బావుల వద్ద పడిగాపులు



బీఆర్‌ఎస్ సర్కారు రైతుల ప్రభుత్వం. కాంగ్రెస్ ఏలికలో మేము పడ్డ కష్టాలను ఇంకా మరిచిపోలే. అప్పట్లో పగటి పూట 3 గంటలు, రాత్రి పూట 3 గంటల కరెంటు మాత్రమే ఇచ్చేవారు. కరెంటు ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక రాత్రనకా, పగలనకా పొలాల దగ్గర పడిగాపులు పడేవాళ్లం. పాములు, పురుగులు కరిచి, కరెంటు షాక్‌తో పోయిన ప్రాణాలకు లెక్కలేదు. నీరు సరిగా పారక దిగుబడి చాలా తక్కువ వచ్చేది. అప్పుల ఊబిలో కూరుకుపోయాం. కేసీఆర్ సారు వచ్చినంక 24 గంటల కరెంటు ఇస్తుండు. కాంగ్రెస్ 3 గంటల కరెంటు ఇస్తే మా బతుకులు ఆగమవుతాయి. బోర్లకు 10 హెచ్‌పీ మోటర్లు బిగించుకొమ్మని చెబుతున్నారు. నీటి కరువు ఎక్కువై మళ్లీ అప్పుల్లో మునిగిపోవడం ఖాయం. రైతుల సంక్షేమానికి పాటుపడుతూ వ్యవసాయం దండుగ కాదు పండుగ అని నిరూపించిన బీఆర్‌ఎస్‌కే మా రైతాంగం మద్దతు.

**- రమేశ్, అగ్గనూర్, యాలాల**

### 24 గంటల కరెంటుతోనే సాఫీగా సాగు



ప్రభుత్వం సరఫరా చేస్తున్న 24 గంటల కరెంటుతోనే పంటలను సాఫీగా సాగు చేసుకోవచ్చు. కాంగ్రెస్ వాళ్లు అంటున్నట్లు మూడు గంటల కరెంటు ఇస్తే ఎవుసం మానేయాల్సిందే. ప్రస్తుతం 24 గంటల కరెంటుతో రైతులు సంతోషంగా పంటలు పండిస్తున్నరు. భూముల ధరలు కూడా పెరిగాయి. సీఎం కేసీఆర్ అమల్లోకి తెచ్చిన ధరణి పోర్టల్‌తో కూడా రైతుల భూములకు రక్షణ కవచంలా మారింది. దీనిని తీసేస్తే రైతులకు మళ్లీ పాత రోజులే వస్తాయి. పట్వారీలు వచ్చి రైతులను పీడిస్తరు. ఇదంతా రైతులకు ఇబ్బందికర పరిస్థితి తెస్తుంది. కేసీఆర్ పాలనే రైతులకు భరోసా ఇస్తుంది.

**- సుదర్శన్‌రెడ్డి, బురాన్‌పూర్, బొంరాస్‌పేట**